దస్తురాబాద్ : కవర్లలో మట్టీని నింపుతున్న కూలీలు

దస్తురాబాద్: మట్టి నింపిన కవర్లకు నీళ్లు పడుతున్న కూలీ

పల్లె పల్లెనా పచ్చదనం..

- పదో విడుత హరితహారానికి పనులు ప్రారంభం
- హరిత లక్ష్యం 1.39లక్షల మొక్కల పెంపకానికి ఏర్పాట్లు
- కొనసాగుతున్న నర్సరీలు పనులు

దస్తురాబాద్ : ఏర్పాటు చేసిన నర్సరీ

దస్తురాబాద్,డిసెంబర్17 : పట్టణాలు పచ్చదనంతో కళకళలాడేలా చేపట్టిన హరితహారం విజయవంతానికి అధికారులు సన్నద్ధమయ్యారు. 8వ విడుత హరితహారం కార్యక్రమంలో భాగంగా మండలంలో 1.39 లక్షల మొక్కలు నాటిడం లక్ష్యంగా ప్రణాళికను రూపొందించారు. ఈజీఎస్ నిధులతో ఆకుపచ్చ తెలంగాణే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం హరితహారం పదో విడుతకు సన్నద్ధమవుతున్నది. పల్లెలు,పట్టాణాలు పచ్చదనంతో కళకళలాడేలా చేపట్టిన 10 విడుత హరితహారం కార్యక్రమాన్ని విజయవంతం చేయడానికి అధికారులు సన్నద్ధమయ్యారు. దీంతో మండలంలో హరిత పనులు ముమ్మరంగా కొనసాగుతున్నాయి. మండలంలో 1.39 లక్షల మొక్కలను నాటేందుకు నర్సరీలను సిద్ధం చేస్తున్నారు. ప్రతి నర్సరీకి 13 వేల మొక్కల చొప్పున పెంచాలనే లక్ష్యంతో పనులు జోరుగా చేపడుతున్నారు. మండలంలోని 13 గ్రామ పంచాయతీల్లో లక్ష్యానికి అనుగుణంగా నర్సరీలో బ్యాగ్ ఫిల్లింగ్ చేపట్టారు. ఇందులో ఎర్రమట్టి, సేంద్రియ ఎరువులను కలుపుతున్నారు. నర్సరీలో మట్టి పోసి బ్యాగులను నింపే కార్యక్రమం చివరి దశకు చేరుకుంది. విత్తనాలను పెట్టే కార్యక్రమాన్ని వేగవంతం చేసేలా అధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ సర్పంచ్‌ల సహకారంతో పనులు సకాలంలో పూర్తయ్యేలా చర్యలు తీసుకుంటున్నారు. పండ్లు, నీడనిచ్చే మొక్కలను పెంచి ఇంటింటికీ సరఫరా చేసేలా కార్యాచరణ రూపొందించారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు గ్రామాలను హరితమయం చేసేందుకు అధికారులు, పంచాయతీ కార్యదర్శులు నిరంతరం పర్యవేక్షిస్తున్నారు. వచ్చే వానాకాలంలో హరిత లక్ష్యాన్ని సాధించే దిశగా ముందుకెళ్తున్నారు.

• నర్సరీల్లో ముమ్మరంగా పనులు

ఊరురా పంచాయతీ నర్సరీలలో మొక్కలను పెంచేందుకు పనులు ముమ్మరంగా కొనసాగుతున్నాయి. సాయి కలెక్షన్, బ్యాగ్ ఫిల్లింగ్ ,సీడ్ కొనుగోలు తదితర పనులు ఊపందుకున్నాయి. సర్పంచ్‌ల సహకారంతో పంచాయతీ కార్యర్శులు, అధికారులు ప్రతి రోజు పనులను పర్యవేక్షిస్తున్నారు. జూన్ నాటికి మొక్కలను పెంచి ఇంటింటికీ సరఫరా చేసేలా సన్నద్ధమవుతున్నారు.

• పెంచుతున్న మొక్కలు ఇవే

ఈ సారి పూల మొక్కల పెంపకాన్ని అధికారులు మినహాయించారు.అడవి జాతీ మొక్కలు,పండ్ల మొక్కల పెంపకంపై మక్కువ చూపిస్తున్నారు. జామ, దానిమ్మ, నిమ్మ, సీతా ఫలం, చింత,కరివేప,అండ్ల నేరడి ఊసిరి, మునగ, గుల్‌మోర్, వెలగ, జీట్రేగీ, రాగి, మర్రి, ఇతరాత్ర మొక్కలను పెంచడంపై దృష్టి సారించారు.

• నర్సరీల ఏర్పాటుతో కూలీలకు ఉపాధి...

ఉపాధి పథకం ద్వారా నర్సరీలు ఏర్పాటు చేసి మొక్కలను పెంచుతుండడంతో కూలీలకు ఉపాధి లభిస్తుంది. మొక్కల పెంపకానికి పాలిథిన్ బ్యాగుల్లో మట్టి నింపి బెడ్స్ తయారు చేయడం, మొక్కలకు ప్రతి రోజు నీళ్లు పట్టడం వంటి పనులతో కూలీలకు ఉపాధి లభిస్తుంది.

పనులు చేపడుతున్నాం..

నర్సరీల లో మొక్కల పెంపకం పనులను చేపడుతున్నాం.మట్టి తెప్పించడం.జల్లెడ పట్టడం,కవరల్లో మట్టి నింపడం, విత్తనాలను పెట్టే పనులు జరుగుతున్నాయి. లక్ష్యానికి అనుగుణంగా బ్యాగుల ఫిల్గింగ్ చేస్తున్నాం. ప్రతి గ్రామంలో ఉపాధిహామీ కూలీలతో,వన సేవకులతో పనులు చేయిస్తున్నాం. వచ్చే వానకాలం నాటికి హరితహా రం మొక్కలను సిద్ధం చేయాలనే లక్ష్యంతో పనులను వేగవంతంగా చేయిస్తున్నాం. అందరి సహకారంతో హరితహారాన్ని విజయవంతం చేస్తాం.

- సుద్దాల రాజన్న,ఫీల్డ్ అసిస్టెంట్,రేవోజిపేట

పకడ్బందీగా నర్సరీల నిర్వహణ

పకడ్బందీగా నర్సరీలను నిర్వహిస్తున్నాం. మండలంలో మొత్తం గా 1.39 లక్షల మొక్కల లక్ష్యంతో 13 గ్రామ పంచాయతీలలో నీటి సౌకర్యం ఉన్నచోట ఈ నర్సరీలను సిద్ధం చేసినం. ఎప్పటికప్పుడు నర్సరీలను పరిశీలిస్తున్నం. ప్రస్తుతం బ్యాగ్ ఫిల్లింగ్, విత్తనాలను నాటే పనులు గ్రామ పంచాయతీలలో కొనసాగుతున్నాయి. పదో విడుత హరితహారం కార్యక్రమంలో భాగంగా నర్సరీలను పంచాయతీలలో ఏర్పాటు చేశాం. ఈ నర్సరీల్లో టేకుతో పాటు,పండ్లు,నీడ నిచ్చే, ఇండ్ల మొక్కలను సిద్ధం చేస్తున్నాం. నర్సరీ నిర్వహణలో అలసత్వం వహిస్తే బాధ్యులపై చర్యలు తీసుకుంటాం.

-విజయ్ భాస్కర్ రెడ్డి,ఎంపీడీవో,దస్తురాబాద్

దస్తురాబాద్ : మండల కేంద్రంలోని శ్రీ లక్ష్మీ నరసింహా స్వామి ఆలయంలో పూజలు చేస్తున్న భక్తులు

ఆలయాల్లో ధనుర్మాస ఉత్సవాలు ప్రారంభం

దస్తురాబాద్,డిసెంబర్ 17 : మండల కేంద్రంలోని లక్ష్మీ నరసింహా స్వామి,శ్రీ వేంకటేశ్వరస్వామి, మండలంలోని రేవోజిపేట గ్రామంలోని శ్రీ రామలింగేశ్వర స్వామి ఆలయాల్లో ఆదివారం ధనుర్మాసం ఉత్సవాలు ప్రారంభమైయ్యాయి. ఈ సందర్భంగా ఆలయాల అర్చకులు కొండమా చార్యులు,నరేశ చార్యులు, వంశీచార్యులు వేకువ జామునస్వామి వార్లకు అభిషేకాలు,ప్రత్యేక పూజలు నిర్వహించారు. ధనుర్మాసం ప్రత్యేకతను,విశిష్టతను భక్తులకు వివరించారు.విష్ణుమూర్తికి ధనుర్మాసం ప్రీతికరమైనదని అర్చకులు తెలిపారు. గోదాదేవి(అండాళ్) మార్గళి వ్రతం పేరుతో ధనుర్మాసమంతా విష్ణు వత్రం చేపట్టి స్వామి వారిని కీర్తించి,భక్తి మార్గం ద్వారా భగవంతుని సులభంగా వశపర్చుకోవచ్చని నిరూపించిన ఆరాధన తపస్వీని గోదాదేవి అని పేర్కొన్నారు.ఈ మాసంలో వైష్ణవ ఆలయాలను సందర్శించి ప్రత్యేక పూజలు చేయడం మంచిదని వివరించారు.ఈ కార్యక్రమంలో భక్తులు,మహిళలు,తదితరులు పాల్గొన్నారు.

సల్లంగా సూడు..పోచమ్మ తల్లీ

గుండాయి ఆలయానికి కాలినడకన వస్తున్న భక్తులు

నార్నూర్,డిసెంబర్17: మండలంలోని గుండాల గ్రామ సమీపంలో కొలువుదీరిన పోచమ్మ తల్లీను దర్శించుకునేందుకు భక్తులు వివిధ ప్రాంతాల నుంచి వచ్చి ఆదివారం పూజలు నిర్వహిం చారు. ఆలయంలో కొలువుదీరిన పోచమ్మ తల్లికి నైవేద్యాన్ని సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. భక్తులతో ఆలయ ప్రాగంణం కిటకిటలాడింది. అక్కడే పిండి వంటకాలు చేసి సహపంక్తి భోజనాలు చేశారు. పోచమ్మ తల్లీకి మొక్కలు తీర్చుకుని సల్లంగా చూడాలని వేడుకున్నామని భక్తులు తెలిపారు.

జనవరి 1న భీమా కోరేగావ్ శౌర్య దివస్

ఉట్నూర్,డిసెంబర్17: ఉట్నూర్ పట్టణంలో జనవరి 1న నిర్వహించే భీమా కోరేగావ్ 205వ శౌర్యదివస్ సభను విజయవంతం చేయాలని అంబేద్కర్ అసోసి యేషన్ మండలాధ్యక్షుడు,ఉపాధ్యక్షుడు జగజీవన్,కాంబ్లే ప్రజ్ఞాశీల్ పిలుపునిచ్చారు. ఆదివారం ఉట్నూర్‌లో విలేకరులతో మాట్లాడుతూ..భీమా కోరేగావ్ అమరవీరులకు నివాళులర్పించేందుకు దళిత,ఆదివాసీలు,బహుజనులు తరలివచ్చి సభను విజయవంతం చేయాలని వారు కోరారు. ఈ సమావేశంలో సంయుక్త కార్యదర్శి కొల్లూరి స్వామి,అధికార ప్రతినిధి బొంకంటి సుభాశ్,కోశాధికారి మొకింద్ టిబోతే,యువ నాయకులు ఆకాశ్,బండి విజయ్ తదితరులున్నారు.

వేసెక్టమీ శస్త్ర చికిత్సపక్షోత్సవాన్ని సద్వినియోగించుకోవాలి

నార్నూర్, డిసెంబర్17: వేసెక్టమీ శస్త్ర చికిత్స పక్షోత్సవాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆరోగ్య పర్యవేక్షుడు చౌహాన్ చరణ్‌దాశ్ అన్నారు. ఆదివారం మండలంలోని పలు గ్రామాల్లో వెసెక్టమీ శస్త్ర చికిత్సపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఈ నెల 24వర కు శస్త్ర చికిత్సలు నిర్వహించనున్నట్లు తెలిపారు. పురుషులకు కోత,కుట్టులేని వెసెకమీకు టుంబ నియంత్రణ ఆపరేషన్ ఉచితంగా చేస్తార ని, భర్తలకు సురక్షితమైందని, కేవలం ఐదు నిమిషాములో ఆపరేషన్ చేస్తామన్నారు. కు టుంబ నియంత్రణ చేసుకున్న పురుషులకు రూ.1100 పారితోషికం అందిస్తారని చెప్పారు. ఆసక్తిగల వారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అవసమైరన వారు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో పేర్లు నమోదు చేసుకోవాలన్నారు. ఇక్కడ హెల్త్ అసిస్టెంట్ చౌహాన్ ఈశ్వర్‌నాయక్ ఉన్నారు.

నార్నూర్ :అవగాహన కల్పిస్తున్న ఆరోగ్య పర్యవేక్షకుడు చౌహాన్ చరణ్‌దాశ్

విద్యుత్ సీఎండీని కలిసిన ఎస్ఈ

విద్యుత్ శాఖ సీఎండీ వరుణ్‌రెడ్డికి మొక్కను అందిస్తున్న ఎస్ఈ , ఉద్యోగులు , విద్యుత్ కాంట్రాక్టర్స్

ఉట్నూర్ రూరల్, డిసెంబర్ 17: విద్యుత్ సంస్థ సీఎండీగా పదవీ బాధ్యతలు చేపట్టిన వరుణ్‌రెడ్డి వ్యక్తిగత పనులపై ఉట్నూర్‌కు రాగా ఆదివారం జిల్లా విద్యుత్ శాఖ ఎస్ఈ సంపత్‌కుమార్, ఉద్యోగులు, కాంట్రాక్టర్స్ ఐటీడీఏ కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి మొక్కను అందించి శుభాకాంక్షలు తెలిపారు. సీఎండీ వరుణ్‌రెడ్డి గతంలో ఐటీడీఏ ప్రాజెక్టు అధికారిగా, నిర్మల్ కలెక్టర్‌గా విధులు నిర్వహించారు. ఈ సం దర్భంగా ఆయన మాట్లాడుతూ, విద్యుత్ సరఫరాలో సమస్యలు తలెత్తకుండా చూడాలన్నారు. ప్రజలకు, రైతులకు 24 గంటలు న్యాణ్యమైన విద్యుత్ సరఫరా చేయాలన్నారు. పెండింగులో ఉన్న పనులను త్వరగా పూర్తిచేయాలని సూచించారు. ము ఖ్యంగా నూతనంగా చేపట్టే విద్యుత్ పనుల్లో జాప్యం జరగకుండా, నాణ్యతగా నిర్వహించాలన్నారు. విద్యుత్ పనుల్లో సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని పేర్కొన్నారు. ఉట్నూర్ డివిజన్‌లోని పలు సమస్యలు దృష్టికి తీసుకురాగా పరిష్కారానికి తనవంతు కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమలో విద్యుత్ ఏడీఈ చంద్రశేఖర్, ఏఈ శ్రావణ్, రోహిదాస్, సాయి, సిబ్బంది, కాంట్రాక్టర్స్ అసోసియేషన్ ఉట్నూర్ డివిజన్ అధ్యక్షుడు జాదవ్ ప్రకాశ్, ఉపాధ్యక్షుడు వినయ్‌కుమార్, కార్యదర్శి బాలాజీ తదితరులు ఉన్నారు.